క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

సత్తెనపల్లి: పట్టణ, పరిసర ప్రాంత ప్రయాణికులు ఆర్టీసీకి సంబంధించి తమ సలహాలు, సూచనలు, సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకు వచ్చేందుకు బుధవారం 12.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు డయల్ యూవర్ డీఎం జరుగు తుందని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ మంగళవారం తెలిపారు. ఫోన్ చేయవలసిన నంబరు : 9959225429. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియో గించుకోవాలని ఆయన కోరారు.

పరీక్ష మెటీరియల్ పంపిణీ



పెదకూరపాడు: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నారై మాగులూరి భాను ప్రకాష్ సహకారంతో పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను నిర్వాహకుడు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌కుమార్, కొండవీటి ప్రసాద్ మంగళవారం పంపిణీ చేశారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

ఈనెల 31న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్లో జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి మంగళవారం తెలిపారు. సమావేశంలో అజెండాలోని 35 అంశాలపై చర్చించి ఆమోదించడం జరుగు తుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫీషియోగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరౌతారన్నారు. అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు, హాజరుకావాలని కోరారు.

పోలీస్ స్టేషన్‌లో 10 ప్రశ్నపత్రాలు భద్రం



రాజుపాలెం: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరిగే 10వ తరగతి సెట్–2 ప్రశ్నాపత్రాలను రూట్ అధికారి ఎంఈఓ మల్లిఖార్జునశర్మ స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం భద్రపరిచారు. మండలంలో గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో 162 మంది విద్యార్థులు, రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాల వద్ద శాంతి భద్రతలు పర్యవేక్షించేందుకు ఎస్ఐ ఎమ్ నారాయణకు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చినట్లు తెలిపారు.

విద్యుత్‌లైన్ల ఆధునీకరణ

నకరికల్లు: విద్యుత్‌లైన్లు ఆధునీకరించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ఆశాఖ ఏఈ రూఫస్‌డానియేల్ మంగళవారం తెలిపారు. నకరికల్లులోని పలుచోట్ల విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసి నూతన లైన్లు ఆధునీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఈదురుగాలులకు, వర్షానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో మరమ్మతులు చేపడుతున్నామన్నారు. ప్రాంతాల వారీగా మరమ్మతులు పూర్తవుతున్నాయని త్వరలో కోతలు లేని విద్యుత్‌ను సరఫరా చేస్తామని తెలిపారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

ముప్పాళ్ల: ఒత్తిడిని అధికమించి పరీక్షలు రాసి విద్యార్థులందరు ఉత్తీర్ణత సాధించాలని ఎంపీపీ మారూరి పద్మారామలింగారెడ్డి తెలిపారు. మండలంలోని గోళ్లపాడులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి బాలికలకు అభినందన ఆర్ఫన్ అండ్ నీడీ సేవా సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్, స్కేల్, పెన్నులు మంగళవారం ఎంపీపీ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అందరు ఉత్తీర్ణత సాధించి మండలానికి మంచి పేరు తేవాలన్నారు. సేవా సొసైటీ అధ్యక్షుడు కందుల సురేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తీర్ణ సాధించి ఉన్నత శిఖరాలు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి ఝన్సీ, సొసైటీ సభ్యులు మన్నెం కోటేశ్వరరావు, పలుకూరి రామారావు, ఉపాధ్యాయులు స్వరూప, ప్రేమలత, ప్రసన్న ,అరుణకుమారి, కృష్ణవేని, విజయకుమారి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడిగా రంగిశెట్టి

నరసరావుపేట: బీజేపీ నరసరావుపేట అసెంబ్లీ కన్వీనర్‌గా రంగిశెట్టి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు తనను నియమిస్తూ మంగళవారం ప్రకటించారని రామకృష్ణ వెల్లడించారు. ఇప్పటివరకు రామకృష్ణ పట్టణ అధ్యక్షులుగా వ్యవహరిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు.


జగనన్న కాలనీ..పేదలకు భద్రత

- వేగం పుంజుకున్న వైఎస్సార్ జగనన్న కాలనీ గృహ నిర్మాణాలు
- విస్తృతంగా మౌలిక వసతుల ఏర్పాట్లు
- అధికారుల అవగాహన..లబ్ధిదారుల్లో చైతన్యం
- పెదకూరపాడు నియోజకవర్గంలో 8,043 ఇళ్ల స్థలాలు



క్రోసూరు జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు

క్రోసూరు: వైస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతులను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తూ.. పూర్తిస్థాయి భద్రతా భావాన్ని లబ్ధిదారుల్లో కల్పిస్తోంది. తమకు ఇచ్చిన స్థలాల్లో లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 108 వైఎస్సార్ జగనన్న లేఅవుట్లను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది. హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.1.80లక్షలు ఒక్కో గృహానికి మంజూరు చేసింది. నియోజకవర్గంలోని క్రోసూరు, అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు మండలాల్లో 8,043 ఇళ్ల స్థలాలను పేదలకు మంజూరు చేయడం జరిగింది. బెల్లంకొండ మండలంలో 300 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. అయితే ఇక్కడ గృహ నిర్మాణాలకు ఇంకా



పూర్తయిన గృహం

అనుమతులు రాలేదని హౌసింగ్ ఏఈ రామ్ సైదా నాయక్ తెలిపారు. మొత్తంగా వివిధ దశల్లో గృహ నిర్మాణాలున్నాయి. అయితే..చరిత్రలో ఏ ప్రభుత్వం పేదలకు ఇంత భారీ స్థాయిలో ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహ నిర్మాణాలు చేపట్ట లేదని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అర్హతున్న ప్రతి పేదవాడికి (1.50 సెంట్లు) ఇంటి స్థలం మంజూరు చేసి, రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో కాలనీల్లో దాదాపుగా అన్నింటిలో విద్యుత్ సౌకర్యం కల్పించారు. అంతేకాక గృహ నిర్మాణాలకు డ్వాక్రా మహిళలకు బ్యాంకుల ద్వారా రూ.30వేల రుణ సహాయం అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆనందంగా ఇళ్లుకట్టుకుంటున్నారు. కొంత మంది ఇళ్లు నిర్మించుకుని ప్రారంభోత్సవాలు పూర్తి చేసి, నివాసం ఉంటున్నారు. జగనన్న కాలనీలు.. ఒక ప్రత్యేక గ్రామాల్లా.. మారనున్నాయని ప్రజలు చెప్పుకుంటున్నారు.

	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	అర్ఫ్	పూర్తిచేసుకున్నవి	మొత్తం
క్రోసూరు:	1490	347	54	31	141	2063.
అచ్చంపేట:	1858	452	46	18	138	2512.
అమరావతి:	1425	501	57	22	91	2096
పెదకూరపాడు:	884	348	43	11	86	1372.
మొత్తం	5657	1648	200	82	456	8043.

పొడిగింపు వద్దు..శాశ్వత చట్టం చేయాలి

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై..సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అమరావతి: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టానికి కాల పరిమితి లేకుండా సమగ్ర శాశ్వత చట్టంగా రూపొందించాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ధ్యాన బుద్ధ విగ్రహం వద్ద హరిత అతిథి గృహంలో నిర్వహిస్తున్న కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు మంగళవారం రెండవ రోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రవిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు అనే అంశంపై ఆయన మాట్లాడుతూ.. చట్టం కాల పరిమితిని పొడిగించటం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని.. దానిని సమగ్ర శాశ్వత చట్టంగా మారిస్తేనే బలహీన వర్గాల బతుకులు ఉద్ధరించబడతాయని పేర్కొన్నారు. పదేళ్లుగా సబ్ ప్లాన్ చట్టం అమలును పరిశీలిస్తే దళితవాడలు అభివృద్ధికి దూరంగానే ఉన్నాయన్నారు. దళితవాడలు అభివృద్ధి చెందక, దళితుల జీవన ప్రమాణాలు పెరగక సబ్ ప్లాన్ నిధులు ఏమవుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షులు అనంద్‌బాబు, చిరంజీవి, నటరాజ్, బాగ్యలక్ష్మి, సహాయ కార్యదర్శులు పి.వసంత్, తిరుపాల్, అమరావతి మండల ప్రజా సంఘాల కన్వీనర్ బి.సూరిబాబుతో పాటుగా పలు జిల్లాల నుంచి కేవీపీఎస్ ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రతి విద్యార్థిని పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) షేక్ బాలిసైద్



పరీక్ష సామగ్రి అందుకున్న విద్యార్థినులతో నిర్వాహకులు

సత్తెనపల్లి: ప్రతి విద్యార్థిని పోటీతత్వన్ని అలవర్చుకోవాలని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) షేక్ బాలి సైద్ అన్నారు. పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో (కేజీవీబీ) పట్టణానికి చెందిన ఒక అజ్ఞాత వ్యక్తి దాత దాతృత్వంతో హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థినులకు పరీక్ష సామగ్రి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ ప్రసన్న అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలి సైద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్న నాటి నుంచి పోటీ తత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని మనసులో నింపుకోవాలన్నారు. తమ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని,
సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే వారే అనుకున్నది సాధించగలరన్నారు. అలాగే మహనీయులను ప్రతి రోజు స్మరించుకుంటూ వారి జీవితాలను ఆదర్శంగా తీసుకుంటే మీ జీవితాల్లో కూడా అద్భుతాలను సాధిస్తారన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ పరీక్షల సమయంలో ప్రతి విద్యార్థిని సానుకూల దృక్పథంతో ఆందోళన చెందకుండా ఉండి నట్లయితే పరీక్షలు ప్రశాంతంగా రాయగలరన్నారు. కార్యక్రమంలో న్యాయవాది చావా బాబు రావు, ఆదరణ వృద్ధుల ఆశ్రమ నిర్వాహకురాలు రిషిత, హెల్ప్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ లక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు సురేష్, శేఖర్, నాని, పాఠశాల ఉపాధ్యాయ బృందము, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాదల బీసీ హాస్టల్‌లో అధికారుల తనిఖీ



బీసీ హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భవానిశంకర్, అధికారులు

మాదల(ముప్పాళ్ళ): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బడినిద్రలో భాగంగా మండలంలోని మాదల బీసీ హాస్టల్‌ను మండల స్థాయి అధికారులు మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులతో మమేకమయ్యారు. హాస్టల్‌లోని బోధనాతీరు, వసతులను, భోజనం పై ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థినులకు ప్రత్యేక బోధన చేపట్టాలని, మెరుగైన ఫలితాలు సాధించేలా శిక్షణ అందించాలని తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ చెప్పారు. వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి, ఒక్కో గ్రూపుకు ఒక ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకుని బోధన చేపట్టినట్లయితే మంచి ఫలితాలు నమోదు చేయవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ రూపవతి, ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో హరిప్రసాద్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెరగాలి

జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు జోసఫ్‌కుమార్



ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంపుదల చేయాలని జిల్లా ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరెక్టరు గంగవరపు జోసఫ్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, ఉపాధి అధికారులు అన్నీ శాఖల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి పథకం పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.8 కోట్ల 95 లక్షల 43 వేలు వివిధ రకాల పనులకు వెచ్చించినట్లు చెప్పారు. గత ఏడాదిలో జిల్లాలో 80 లక్షల పనిదినాలు కూలీలకు కల్పించామన్నారు. అమృత సరోవర్ పథకంలో మంచినీటి చెరువులు అభివృద్ధి పనులు, నీటికుంటలు, పంట కాల్వలు తదితర పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రస్తుతానికి జిల్లాలో రోజువారిగా 50 వేల మంది మాత్రమే ఉపాధి పనులు చేస్తున్నారని, ఏప్రిల్ నుంచి లక్ష వరకు కూలీలు పాల్గొనేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతికూలీ రోజు వారీగా అధికారులు సూచనలు మేరకు పని చేసిన వారికి రూ.257 రూపాయలు తగ్గకుండా చూడాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో కూలీల హాజరు పట్టిక నమోదు కాని వారికి వేతనాలు పెండింగ్‌లో లేకుండా ఇవ్వాలన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా గతంలో నిధులు పెండింగ్ ఉన్న వారికి కోర్టులో ఉన్న కేసులన్నీ నిధులు చెల్లింపులు చేశామన్నారు. జనవరి మాసం వరకు కూలీలు వేతనాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అనంతరం మండల స్థాయిలో జరిగిన ఆడిట్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల వారీగా వివరాలు సేకరించారు. ఇందుకుగాను 19 వేల 460 రూపాయలు రికవరీ చేయాలన్నారు. ప్రజావేదిక కార్యక్రమంలో ఏపీడీ బుసిరెడ్డి, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఎస్ఆర్‌పి పున్నపనాయుడు, ఏపీవో రాజు, డీఆర్‌పీలు, అన్నీ గ్రామాల్లోని ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో మహిళ ఆత్మహత్యాయత్నం

అచ్చంపేట: తనకు చెందిన భూమిని బంధువులు ఆక్రమించుకుని వేరే వాళ్లకు రిజిస్ట్రేషన్ చేశారని, న్యాయం చేయాలంటూ ఓ మహిళ మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల మేరకు.. కోగంటివారి పాలేనికి చెందిన పల్లప్రోతు సంపూర్ణమ్మకు చామర్రు రెవెన్యూ పరిధిలో రెండెకరాల సాగు భూమి ఉంది. ఆ భూమిని తన సమీప బంధువులు ఆక్రమించుకుని, వేరే వారి పేరుపై క్రోసూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారని తెలుసుకుని కోర్టును ఆశ్రయించింది. కేసు కోర్టు పరిధిలో ఉండగానే ఆమె తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి.. తన భూమికి సంబంధించిన ఆధారాలను చూపించి 1బీ, అడంగళ్ ఇప్పించాలని కోరింది. కోర్టులో పరిధిలో ఉన్నందున కుదరదని తహసీల్దారు పద్మారాణి సమాధానం ఇచ్చారు. దీంతో మనస్థాపానికి గురైన సంపూర్ణమ్మ గడ్డి మందు తాగింది. విషయం తెలుసుకున్న తహసీల్దారు వెంటనే సత్తెనపల్లికి ఆమెను తరలించారు. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. పూర్తి సమాచారం అందవలసి ఉంది.

రుణాలతో ఆర్థిక పురోగతి సాధించాలి

శావల్యాపురం: మహిళలు తీసుకున్న రుణాలు ద్వారా ఆర్థిక పురోగతి సాధించాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఇల్లింద్రపర్తి విశ్వనాథ్ కోరారు. మంగళవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో స్వయం సహాయక మహిళా సభ్యులకు రుణాలు పంపిణీ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అమలు చేస్తున్న పథకాలపై మహిళలు అవగాహన కల్గియుండాలన్నారు. ప్రభుత్వం అందించుతున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని జీవనోపాదులు పెంపుదల చేసుకోవాలన్నారు. గ్రూపు సభ్యులు నెలవారి సమావేశాలు పుస్తక నిర్వహణతో పాటు రుణా లు చెల్లింపులు చేయు సమయంలో రసీదులు పొందాలన్నారు. ఖాతాదారులు సహకారంతో శావల్యాపురం బ్రాంచ్ శాఖ రూ.165 కోట్లు ఆర్థిక లావాదేవీలతో జిల్లాలో ముందంజలో ఉందన్నారు. అనంతరం 12 గ్రూపులకు రూ. ఒక కోటి 10 లక్షలు రుణాలు మంజూరు చేశారు. ఆయనతో పాటు సహాయ మేనేజరు గుబ్బల సుధీర్, నివ్య, మహేష్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

బొల్లాపల్లి: మండలంలోని వడ్డెంగుంట, బొల్లాపల్లి, మూగచింతలపాలెం గ్రామ సచివాలయాలను డీఎల్‌డీవో ఎం.వెంకటరెడ్డి మంగళవారం సందర్శించారు. ఆయా సచివాలయాల్లో రికార్డులను తనిఖీ చేసి వాటి పరిధిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందజేయాలన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ సర్వేను సంపూర్ణంగా నిర్వహించాలని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సచివాలయాల్లో అందించిన సేవల ద్వారా వచ్చిన నగదును వెంటనే ఖాతాలో జమ చేయాలని తెలిపారు. సమీక్షలో ఎంపీపీ బత్తి రాములు, ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థులకు మెమోంటోలు అందజేస్తున్న నిశ్శంకరావు శ్రీనివాసరావు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 43వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, కాలేజీ అభివృద్ధి కమిటీ సభ్యులు, జనసేన పార్టీ నాయకులు నిశ్శంకరావు శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ఈ కాలేజీలో చదువుకుని చాలామంది అనేక రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమోంటోస్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కాలేజీ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా

- విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రలు చదవాలి
- పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్
- సత్తెనపల్లిలో మదర్ థెరిస్సా విగ్రహావిష్కరణకు శంకుస్థాపన



మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

సత్తెనపల్లి : కలకత్తా మురికివాడలో అప్పటి పేదల దయనీయ పరిస్థితిని చూసి 18 ఏళ్ల వయసులోనే జీవితాంతం సేవ చేయాలనే నిర్ణయం తీసుకున్న మదర్ థెరిస్సా...అవధులు లేని సేవకు ప్రతిరూపమని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 'సెంటర్ ఫర్ రూరల్ అర్బన్ డెవలప్మెంట్ సొసైటీ' ఆధ్వర్యంలో సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకలు పురస్క రించుకొని మదర్ థెరిస్సా విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు 15 ఏళ్ల వయస్సు నుంచి 25 సంవత్సరాల వయస్సు మధ్య బంగారు క్షణాలని, ఈ సమయంలోనే మీరు తీసుకునే నిర్ణయాలు మీ ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. పదవ తరగతి మార్కులే మీ విద్యాభ్యాసంలో కీలకమన్నారు. ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలతో పాటు మహనీయుల జీవిత చరిత్రను తప్పకుండా చదవాలని సూచించారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థుల కోసం భవిత అనే ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తున్నామన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో మదర్ థెరిస్సా విగ్రహ నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. అనంతరం పట్టణంలో ఉత్తమ సేవలు అందించిన మహిళలను సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా మాట్లాడి వారికి తగు సూచనలు చేశారు. కార్యక్రమం లో సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి, సంస్థ వ్యవస్థాపకులు చిలక జాన్సన్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని గుజ్జర్లపూడి విజయ కమల, చిలకలూరిపేట బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ గుజ్జర్లపూడి విజయ సారథి , ఎంపీడీఓ జీవీ. సత్యనారా యణ, తహసిల్దార్ కె.నగేష్, కమిషనర్ కొలిమి షమ్మీ, ఎంఈఓ ఏ.శ్రీనివాసరావు, కార్యక్రమ నిర్వాహకులు చిలక రమణయ్య,జల్లి విజయప్రసాద్, బండారు ఏలియ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు ఉన్నారు.

ఉద్యోగులు క్రీడల్లోనూ రాణించాలి

- సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి
- ఉద్యోగుల కలెక్టర్స్ ట్రోఫీ డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



ఉద్యోగుల కలెక్టర్స్ ట్రోఫీ డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ రాజకుమారి

సత్తెనపల్లి: ఉద్యోగులు వృత్తితో పాటు క్రీడల్లోనూ రాణించాలని సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి చెప్పారు. పల్నాడు జిల్లా తొలి ఆవిర్భావ సంవత్సరికంను పురస్కరించుకుని పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల కలెక్టర్స్ ట్రోఫీ డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆర్డీఓ రాజకుమారి మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు ఉపశమనం పొందేందుకు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో రాణించే ఉద్యోగులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ముందుగా పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సత్తెనపల్లి డివిజన్‌లో ఒక పట్టణం, తొమ్మిది మండలాల నుంచి సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ తదితర ఉద్యోగులు మొత్తం 10 జట్లు హాజరయ్యాయి. ఈ పోటీల్లో అచ్చంపేట–బెల్లంకొండ తలపడగా అచ్చంపేట, సత్తెనపల్లి టౌన్– అమరావతి తలపడగా సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్–రాజుపాలెం తలపడగా సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ–పెదకూరపాడు తలపడగా పెదకూరపాడు, అచ్చంపేట–నకరికల్లు తలపడగా అచ్చంపేట జట్లు గెలుపొందాయి. ఏపూల్‌లో అచ్చంపేట, సత్తెనపల్లి టౌన్ జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. బీ పూల్‌లో ముప్పాళ్ళ జట్టు సెమీఫైనల్‌కు చేరింది. సత్తెనపల్లిరూరల్–రాజుపాలెం ఆడాల్సి ఉండగా బుధవారానికి వాయిదా పడ్డాయి. బుధవారం సెమీఫైనల్ అనంతరం ఫైనల్ పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌డీఓ ఏ. సుధాకర్, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, తహసీల్దార్ కె.నగేష్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ఎంపీడీఓలు శ్రీనివాసరెడ్డి(నకరికల్లు),ఎం.శ్రీనివాసరావు(ముప్పాళ్ళ), శ్రీనివాసరావు(రాజుపాలెం),నరసింహారావు(పెదకూరపాడు),శివరామయ్య(క్రోసూరు), టోర్నమెంట్ ఇన్‌చార్జి ఏ శ్రీరామి రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ఐఎస్. నాగిరెడ్డి, ఎస్ఎం సుభాని, ఎస్‌కె.ఎమ్‌డీ రియాజ్, పీ.శ్రీనివాసరెడ్డి, డీ శ్రీనివాసరావు, ఏ చెన్నయ్య, ఎస్ అచ్చిరెడ్డి, వి. వేమారెడ్డి, తులసి నాయక్, అనిల్, శాంతి, స్వరూప్, క్రాంతి, ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

హసనాబాద్(క్రోసూరు): హసనాబాద్ గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. స్థానిక జెడ్పీ పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు వివరించారు. పౌష్టికాహారం, తృణ ధాన్యాల ప్రయోజనాలు తెలిపారు. బాలికలకు సమస్యలు ఎదురైతే 1098, 181 కాల్ సెంటర్ నంబర్లకు సంప్రదించాలని చెప్పారు. చేతులు శుభ్రం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు బుచ్చమ్మ, శివ కుమారి, గౌతమి, పాల్గొన్నారు.

బాలుర వసతి గృహంలో అధికారుల పల్లెనిద్ర

పాల్గొన్న ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్



హాస్టల్‌లో విద్యార్థులతో సమావేశమైన ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్

నరసరావుపేట రూరల్: పల్లెనిద్రలో భాగంగా మంగళవారం రాత్రి ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, తహసీ ల్దార్ ఆర్‌వీ రమణానాయక్ పల్నాడు రోడ్డు రావిపాడు పంచాయతీ పరిధిలోని రెడ్డినగర్ ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ఈసందర్భంగా పదోతరగతి, తదితర తరగతుల విద్యార్థులతో సమావేశమయ్యారు. తమకు ఫిజిక్స్ చెప్పేందుకు ట్యూటర్ కావాలని పదోతరగతి విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా ఏర్పా టు చేస్తామని హామీ ఇచ్చారు. వారితో కలిసి నిద్ర చేశారు. బుధవారం ఉదయాన్ని గ్రామోదయం లో భాగంగా గ్రామంలో పర్యటిస్తామని తహసీల్దార్ వెల్లడించారు.

కేజీబీవీలో తహసీల్దార్ హాస్టల్ నిద్ర

నాదెండ్ల: వసతి గృహాల్లో చదివి ఉన్నత విద్యావంతులై జీవితంలో గొప్పగా రాణిస్తున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని తహసీల్దారు ఏవీ రమణ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం సందర్శించి హాస్టల్ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాఠశాల విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అందుతున్న అల్పాహారం, భోజన మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాధవీలత, ఆర్ఐ రమీజా ఉన్నారు.